సాక్షి
వికారాబాద్
శుక్రవారం । 7 । ఏప్రిల్ । 2023



రుణాలు చెల్లించండి

రైతులు ఎన్‌సీడీసీ రుణాలను సకాలంలో చెల్లించాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి అనిల్‌కుమార్ సూచించారు. 8లో▸



బీటీరోడ్లకు మోక్షమెప్పుడో?

కుల్కచర్ల, చౌడాపూర్ మండలాల్లోని మారుమూల ప్రాంతాలతో రహదారులు అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. 9లో▸





తాండూరు టౌన్: ప్రత్యేక ఆకర్షణగా శ్రీరాముని విగ్రహం



అనంతగిరి: ఎమ్మెల్యే ఆనంద్ తదితరులు



తాండూరు టౌన్: పట్టణంలో నిర్వహించిన శోభాయాత్రలో భక్తజనం



తాండూరు టౌన్: హనుమాన్ విగ్రహాన్ని ఊరేగిస్తూ..

సింధూర శోభితం..

వైభవంగా హనుమాన్ శోభాయాత్ర

హనుమాన్ జయంతిని పురస్కరించుకొని విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో శోభాయాత్రను వైభవంగా నిర్వహించారు. జై శ్రీరాం.. జై హనుమాన్ నామస్మరణలతో పట్టణాలు, గ్రామాలు మార్మోగాయి. శోభాయాత్రలో ప్రజాప్రతినిధులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. యువకులు నృత్యాలు చేస్తూ హోరెత్తించారు. వీరాంజనేయుడు, రాముడు, ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాలను ఊరేగించారు. వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్ పట్టణాల్లో జరిగిన వేడుకల్లో భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



అనంతగిరి: వికారాబాద్ పట్టణంలో యువకుల నృత్యాలు

న్యూస్‌రీల్

బంజారాల అభ్యున్నతికి కృషి



ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డిని సన్మానిస్తున్న గిరిజన నాయకులు

పరిగి: బంజారాల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తున్నదని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. పరిగి పట్టణంలో బంజారా భవనం నిర్మాణానికి ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కావడంతో గురువారం బంజారా నాయకులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపి సన్మానించారు. ఈ సందర్భంగా మహేశ్‌రెడ్డి మాట్లాడుతూ తండాలను సైతం పంచాయతీలుగా మార్చిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని అన్నారు. గతంలో గిరిజనులను, తండాలను ఏ ప్రభుత్వాలు పట్టించుకోలేదన్నారు. సీఎం కేసీఆర్ బంజారాల అభ్యున్నతికి ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అరవింద్‌రావు, రైతు సమన్వయసమితి కోఆర్డినేటర్ రాజేందర్, ప్రవీణ్‌రెడ్డి, సోందేపూర్ సర్పంచ్ భోజ్యానాయక్, నజీరాబాద్ సర్పంచ్ గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా కండక్టర్ నిజాయితీ

బస్సులో మరిచిన రూ. 50వేల నగదు ప్రయాణికుడికి అప్పగింత



రూ. 50వేల నగదును ప్రయాణికుడికి అప్పగిస్తున్న ఆర్టీసీ సిబ్బంది

తాండూరు టౌన్: బస్సులో మరిచిపోయిన రూ. 50 వేల నగదును ఓ మహిళా కండక్టర్ నిజాయితీగా తిరిగి ప్రయాణికునికి అప్పగించారు. ఈఘటన గురువారం తాండూరు - మహబూబ్‌నగర్ మార్గంలో చోటు చేసుకుంది. తాండూరు డిపోకు చెందిన బస్సు మహబూబ్‌నగర్ వెళ్తుండగా మార్గమధ్యలో గండీడ్ వద్ద కురవ మల్లయ్య అనే వ్యక్తి బస్సు ఎక్కాడు. మహబూబ్‌నగర్‌లో ప్రయాణికులందరూ దిగిన అనంతరం బస్సు కండక్టర్ భారతి ఓ సీటులో ప్లాస్టిక్ కవర్‌ను గమనించారు. అందులో బ్యాంకు నుంచి డ్రా చేసినట్లుగా ఉన్న రూ. 50వేల నగదు ఉండటంతో మహబూబ్‌నగర్ స్టేషన్ మేనేజర్‌కు అప్పగించారు. అయితే తాను బస్సులో నగదు పోగొట్టుకున్నానంటూ సదరు ప్రయాణికుడు స్టేషన్ మేనేజర్‌ను సంప్రదించగా, ఆ నగదు అతనిదేనని నిర్ధారించిన అనంతరం తిరిగి అప్పగించారు. కండక్టర్ భారతి నిజాయితీని తోటి సిబ్బంది, అధికారులు కొనియాడారు.

12న సెక్యూరిటీ సమ్మిట్

హిమాయత్‌నగర్: సైబర్ నేరాల నియంత్రణపై 'హైదరాబాద్ సిటీ సెక్యూరిటీ కౌన్సిల్' (హెచ్‌సీఎస్సీ) సమ్మిట్‌ను నిర్వహించనుంది. ఈ నెల 12న నగరంలోని తాజ్‌దక్కన్ ఇందుకు వేదిక కానుంది. సైబర్ నేరగాళ్ల బారిన పడి చాలా మంది నష్టపోతున్నారు. ఈ నేపథ్యంలో ఆయా వర్గాల వారికి అవగాహన కల్పించేందుకు సమ్మిట్‌ను నిర్వహిస్తున్నారు. ముఖ్యఅతిథిగా మంత్రి కేటీఆర్ హాజరవుతున్నారు.

వరి.. రైతన్న గురి

రికార్డు స్థాయిలో సాగు

- ప్రత్యామ్నాయం వైపు అనాసక్తి
- యాసంగిలో సుమారు లక్ష ఎకరాల్లో సాగు విస్తీర్ణం
- రెండు వారాల క్రితం వరకూ సాగిన వరినాట్లు



సాగు అవుతున్న వరి

వికారాబాద్: ఈ ఏడాది యాసంగిలో రికార్డు స్థాయిలో వరి సాగు అవుతోంది. గతంతో పోలిస్తే జిల్లాలో 40 శాతం మేర సాగు విస్తీర్ణం పెరిగింది. రెండేళ్ల నుంచి వ్యవసాయ శాఖ వరికి ప్రత్యామ్నాయ పంటల మంత్రం జపిస్తుండగా రైతులు మాత్రం అందుకు విరుద్ధంగా వరివైపే మొగ్గుచూపుతున్నారు. ప్రభుత్వం ఈ ఏడాది వరి సాగు వద్దు అనే నిబంధన విధించలేదు. అయితే వ్యవసాయ శాఖ అధికారుల ప్రత్యామ్నాయంపై అవగాహన కార్యక్రమాలు చేపట్టినప్పటికీ రైతులు మాత్రం వారి సాగువైపే మొగ్గు చూపారు. యాసంగిలో సాగైన మొత్తం పంటల్లో 50 శాతానికి పైగా రైతులు వరినే సాగు చేశారంటే ఏమేర మక్కువ కనబరుస్తున్నారో అర్థం అవుతోంది.

ఆంక్షలు పెట్టకపోవడంతో..

ఈ యాసంగి వరి సాగులో రికార్డులు బ్రేక్ చేశారు. ఐదారేళ్ల వరకు జిల్లాలో 30 వేల ఎకరాల్లో వరి సాగు చేసే వారు. 2020–21 సీజన్‌లో 70 వేల ఎకరాలకు వరి సాగు విస్తీర్ణం చేరుకుంది. ఆ తరువాతి ఏడాది ప్రభుత్వం వరి తగ్గించి ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని రైతులపై వత్తిడి చేయటంతో ఆ ఏడాది సాగు విస్తీర్ణం మళ్లీ సాగు 30 వేల ఎకరాలకు తగ్గింది. ప్రస్తుత ఏడాది ప్యాడి సాగు విషయంలో ప్రభుత్వం ఎలాంటి ఆంక్షలు విధించకపోవటంతో రికార్డు స్థాయిలో వరినాట్లు వేశారు. ఈ రబీలో మొత్తం పంటల సాగు విస్తీర్ణం 1,47,700 ఎకరాలు ఉండగా ఇందులో ఒక్క వరి సాగే 90,522 ఎకరాలు అంటే మొత్తం పంటల సాగులో 50 శాతానికి పైగా వరి నాట్లు వేశారని స్పష్టమవుతోంది. జిల్లాలో మిగతా ప్రధాన పంటలైన శనగ 18540, వేరుశనగ 17,192, జొన్న 6850, మొక్కజొన్న 6780 ఎకరాల్లో సాగవుతున్నాయి.

కానరాని ప్రత్యామ్నాయం

ప్రభుత్వం ఆంక్షలు విధించినా.. వ్యవసాయ శాఖ అధికారులు అవగాహన కల్పించినా రైతులు మాత్రం ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లడంలేదు. జిల్లాలో నేలలు వరి సాగుకే అధికంగా అనుకూలంగా ఉన్నందునే రైతులు ఎక్కువగా మొగ్గుచూపుతున్నారు. ఇదే సమయంలో వరినాట్లు వేయడం, కలుపు తీయటం పూర్తయినా మళ్లీ నూర్పిళ్ల సమయం వరకు రైతులు శ్రమించాల్సి ఉండదు. మరోవైపు ప్రభుత్వం ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని చెబుతుందే కానీ ఆ దిశగా రైతులను సిద్ధం చేయడంలేదు. ప్రత్యామ్నాయ పంటల విత్తనాలు అందుబాటులో ఉంచటం, రాయితీలు ఇవ్వడం వంటి ప్రోత్సహించే చర్యలు చేపట్టడం లేదు. ఫలితంగా రైతులు మూసధోరణి నుంచి బయట పడటంలేదు. వరికి ప్రత్యామ్నాయంగా వేరు శనగ, కుసుమ, శనగ, పొద్దు తిరుగుడు, జొన్న, నువ్వులు, పెసర, వినుము, బొబ్బెర్లు, జొన్న, తెల్లకుసమ పంటలు వేసుకోవాలని సూచిస్తుండగా ఆ పంటల సాగు పెద్దగా పెరగడంలేదు.

మూస పద్ధతి వద్దు



రైతులు మూస పద్ధతిలో పంటలు సాగు చేయడం మానుకోవాలి. నికర లాభం ఎక్కువ వచ్చే పంటలవైపు మొగ్గుచూపాలి. ఆ దిశగా రైతులను ప్రోత్సహిస్తున్నాం. కూరగాయలు, చిరుధాన్యాలు, పప్పు దినుసులు సాగుచేసేలా రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. ఇందుకోసం క్లస్టర్లవారీగా రైతు వేదికల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం. ప్రత్యామ్నాయ పంటల సాగు విషయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా విత్తనాలు అందుబాటులో ఉండేలా చూస్తున్నాం.

– గోపాల్, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి

పది పరీక్ష కేంద్రాల ఆకస్మిక తనిఖీ



రెసిడెన్షియల్ పాఠశాల పరీక్షా కేంద్రంలో పరిశీలిస్తున్న కలెక్టర్

వికారాబాద్ అర్బన్: పట్టణంలోని పదో తరగతి పరీక్ష కేంద్రాలను కలెక్టర్ సి. నారాయణ రెడ్డి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, అనంతగిరిపల్లిలోని సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ బాలుర ఉన్నత పాఠశాలలను సందర్శించారు. పరీక్ష నిర్వహణలో ఎలాంటి అలసత్వం వహించినా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఫ్లయింగ్ స్క్వాడ్, పోలీసులు ఎంత మంది ఉన్నారని అక్కడి అధికారులను అడిగి తెలుసుకున్నారు. పరీక్షా కేంద్రంలోకి ఎవరూ సెల్ ఫోన్లు తీసుకురాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సౌకర్యాలు కల్పించడంలో ఎలాంటి అలసత్వం వహించరాదని తెలిపారు. పరీక్షలకు రాని విద్యార్థుల ప్రశ్నపత్రాలు అకౌంట్‌ను పరిశీలించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ వహీదా కాతూన్, ఎంఈఓ బాబు సింగ్ తదితరులు ఉన్నారు.

కాలనీల్లో సమస్యలు పరిష్కరించండి



ఎన్నెపల్లిలో ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనంద్

అధికారులను ఆదేశించిన ఎమ్మెల్యే ఆనంద్

వికారాబాద్ అర్బన్: కాలనీల్లో సమస్యలు సత్వరం పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆనంద్ ఆదేశించారు. గురువారం మీతో నేను కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని 3వ, 15వ వార్డు సాకేత్‌నగర్, ఎన్నెపల్లిలో పర్యటించారు. పట్టణంలోని ప్రధాన రహదారి రైల్వేబ్రిడ్జిపై విద్యుత్ లైట్లు లేని విషయాన్ని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. విద్యుత్ దీపాలను వెంటనే అమర్చాలని ట్రాన్స్‌కో సిబ్బందిని ఆదేశించారు. పలు చోట్ల విద్యుత్ తీగలకు అంతరాయంగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించాలన్నారు. కాలనీల్లో తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు మంజుల ముత్యం రెడ్డి, అనంత్ రెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జింకను పీక్కుతిన్న కుక్కలు



జింక కళేబరాన్ని పరిశీలిస్తున్న ఫారెస్టు రేంజ్ అధికారులు

పెద్దేముల్: కృష్ణజింకను కుక్కలు పీక్కుతిన్న ఘటన గురువారం పెద్దేముల్ మండలంలో చోటుచేసుకుంది. ఇందూరు ఫారెస్టు సెక్షన్ అధికారి మమత తెలిపిన వివరాలిలా ఉన్నాయి. హన్మాపూర్ శివారులో ఉదయం కృష్ణ జింకను కుక్కలు వెంబడించి చంపేశాయి. విషయాన్ని స్థానికులు ఫారెస్టు సెక్షన్ అధికారికి చేరవేశారు. వెంటనే రేంజ్ అధికారి శ్యాంసుందర్‌రావు, సెక్షన్ అధికారి మమత ఘటనాస్థలాన్ని పరిశీలించారు. జింక మాంసాన్ని కూడా కుక్కలు తినివేశాయి. అక్కడే గుంత తీసి కళేబారాన్ని పాతిపెట్టారు. ఆరు నెలల క్రితం కూడా పెద్దేముల్ మండలంలో జింక అనుమానాస్పదస్థితిలో మృతి చెందడంతో అధికారులు అక్కడే గోతితీసి పాతిపెట్టారు. మండలంలో కుక్కల బెడద ఎక్కువైందని స్థానికులు వాపోతున్నారు.

కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం



దోమలో కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న రైతులు

దోమ: రాష్ట్ర ప్రభుత్వం పాడి రైతుల కష్టాలను గుర్తించి పాల ధరలను పెంచడం హర్షించదగ్గ విషయమని పాల ఉత్పత్తి దారుల సంఘం చైర్మన్ గొల్ల శ్రీనివాస్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పాల ఉత్పత్తిదారుల సహకార కేంద్రంలో కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం లీటరు ఆవు పాలుకు రూ.4.50 పైసలు పెంచగా, గేదే పాలకు రూ.6 పెంచిందన్నారు. దీంతో పాడి రైతులు సంతోషంతో ఉన్నారని తెలిపారు. రైతులకు అవసరమైన అన్ని సదుపాయాలను సీఎం కేసీఆర్ కల్పిస్తున్నారని గుర్తు చేశారు.

పూజలు ఘనం.. తరించిన జనం



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

బషీరాబాద్ మండలం దామర్‌చెడ్ అంబాభవానీ మాత ఉత్సవాలు వైభవంగా ముగిశాయి. చివరి రోజు గురువారం ఉదయం అమ్మవారికి సుప్రభాత సేవ చేశారు. గంగాస్నానం, అమ్మవారి పల్లకీ సేవ, మహాభిషేకం, శతఘట్టాభిషేకం ఘనంగా జరిగాయి. మహిళలు బోనాలతో తరలివచ్చి భవానీ మాతకు మొక్కులు చెల్లించుకున్నారు. అంతకు ముందు కలశాలలో తీసుకువచ్చిన గంగాజలాలతో మహానీరాజనం చేశారు. ఆలయ పీఠాధిపతి శంకర్‌స్వామిజీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన ఆధ్యాత్మిక గురువులు సైతం భవానీ మాత ఉత్సవాల్లో పాల్గొన్నారు.

– బషీరాబాద్



బోనాలతో తరలివస్తున్న మహిళలు

అక్రమ కేసులకు బెదరం

- ప్రజల కోసం పోరాడుతాం
- అన్నింటా బీఆర్‌ఎస్ సర్కార్ విఫలం
- జనం బుద్ధిచెప్పడం ఖాయం
- బీజేపీ జిల్లా అధ్యక్షుడు సదానందరెడ్డి
- వికారాబాద్‌లో వాల్ రైటింగ్‌తో ప్రచారం



వాల్ రైటింగ్ కార్యక్రమంలో పాల్గొన్న సదానందరెడ్డి, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తదితరులు

అనంతగిరి: కేసీఆర్ ప్రభుత్వం అక్రమ కేసులు బనాయించి భయభ్రాంతులకు గురిచేస్తున్నదని, అయినా ప్రజల కోసం పోరాడుతామని, భయపడే ప్రసక్తేలేదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సదానందరెడ్డి మండిపడ్డారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అన్నింటా విఫలమైందని, రానున్న రోజుల్లో ప్రజలు తగిన రీతిలో బుద్ధిచెప్పడం ఖాయమని అన్నారు. గురువారం పార్టీ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డితో కలిసి ×ఈ సారి తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం, ఏక్ బార్ ఫిర్‌సే మోదీ సర్కార్¤ అనే నినాదాలతో వాల్‌రైటింగ్ ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సదానందరెడ్డి మాట్లాడుతూ బీజేపీతోనే సుస్థిర పాలన సాధ్యమని అన్నారు. ప్రజల సంక్షేమం, దేశం కోసం ప్రధాని మోదీ అనేక సంస్కరణలు తీసుకువచ్చారన్నారు. పార్టీ క్షేత్రస్థాయిలో బలంగా ఉందన్నారు. అన్ని బూత్ కమిటీలు శక్తివంతంగా ఉన్నాయన్నారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీ తప్పకుండా అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కుటుంబ పాలన కొనసాగుతోందని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం అవినీతిలో కూరుకుపోయిందన్నారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండిపై అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపారని, తప్పకుండా న్యాయం గెలుస్తుందన్నారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం అప్రజాస్వామిక చర్యలకు పాల్పడుతోందన్నారు. ప్రశ్నించే గొంతును నొక్కుతోందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో బీజేపీ ఎదుగుదలను చూసి ఓర్వలేకనే ఇలాంటి కుట్రలకు పాల్పడుతున్నారన్నారు. ఈ ప్రభుత్వాన్ని చూస్తుంటే ఎమర్జెన్సీని తలపించేలా ఉందన్నారు. ప్రభుత్వ వైఫల్యంతోనే పేపర్ లీక్ జరిగిందని, అందుకు విద్యామంత్రి బాధ్యత వహిస్తూ వెంటనే రాజీనామ చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పాండుగౌడ్, ఉపాధ్యక్షుడు రాఘవన్‌నాయక్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు నవీన్‌కుమార్, ముఖ్య నాయకులు అమరేందర్ రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, యాదగిరి, రమేష్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



యాలాల: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన మండలంలో కోకట్ మార్గంలో గురువారం వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ అరవింద్‌కుమార్ తెలిపిన వివరాలు.. తాండూరు – కోకట్ మార్గంలో 32 ఏళ్ల వయస్సు కలిగిన వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. ఘటన స్థలానికి చేరుకొని పోలీసులు వివరాలు సేకరించారు. మృతుడి ఒంటిపై ఎలాంటి గాయాలు లేవని గుర్తించారు. శరీరంపై తెల్లటి బనీయన్, బ్లూ కలర్ జీన్స్ ప్యాంట్ ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడి ఆచూకీ గుర్తిస్తే సెల్ నంబరు 8712670054లో తమను సంప్రదించాలని కోరారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బైక్‌ను ఢీకొట్టిన కారు

ఒకరికి తీవ్ర గాయాలు



ప్రమాదంలో ధ్వంసమైన కారు

పరిగి: కారు, బైక్ ఎదురెదురుగా ఢీకొనడంతో ఒకరికి గాయాలైన సంఘటన సయ్యాద్‌మల్కాపూర్‌లో గురువారం చోటుచేసుకుంది. ఎస్ఐ విఠల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. రావుపల్లికి చెందిన ఎండీ పాష తన బైక్‌పై పరిగి నుంచి రావుపల్లికి వెళ్తుండగా.. షాద్‌నగర్ నుంచి పరిగి వైపు వస్తున్న కారు బైక్‌ను ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న పాషా తలకు బలమైన గాయమైంది. చికిత్స నిమిత్తం బాధితుడిని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పాషా కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కొలనులో పడి వ్యక్తి మృతి

బొంరాస్‌పేట: దర్గాలో ప్రార్థనలు చేసేందుకు వెళ్లిన వ్యక్తి అందులోని కొలనులో పడి మృతి చెందాడు. ఈ సంఘటన కొడంగల్ మండలం చిట్లపల్లి అబ్దుల్ సాహెబ్ దర్గా వద్ద గురువారం చోటుచేసుకుంది. మండలంలోని ఎన్కేపల్లికి చెందిన ఎం అంజిలప్ప(32) హైదరాబాద్‌లో ఉంటున్నాడు. వారం రోజుల క్రితం సొంత ఊరికి వచ్చారు. గంధం ఉత్సవాల్లో పాల్గొనేందుకు కొడంగల్ మండలం చిట్లపల్లి అబ్దుల్‌సాహెబ్ దర్గాకు వెళ్లాడు. అక్కడి కొలనులో పడి అంజిలప్ప మృతిచెందాడు.

బండి సంజయ్‌పై చర్యలు తీసుకోవాలి



బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్‌ఎస్వీ నాయకులు

తాండూరు టౌన్: పదో తరగతి ప్రశ్న పత్రం లీకేజీకి కారణమైన బండి సంజయ్‌పై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ విద్యార్థి విభాగం డిమాండ్ చేసింది. గురువారం తాండూరులో బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్వీ నాయకులు మాట్లాడుతూ.. పదో తరగతి ప్రశ్న పత్రం లీకేజీ కారణమైన సంజయ్‌ను కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ తాండూరు ఇన్‌చార్జ్ జిలాని, పట్టణ అధ్యక్షుడు సందీప్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు షేక్ అకీబ్, దీపక్ రెడ్డి, నాసిర్, షోయబ్, నిరంజన్, మహేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

11నుంచి భద్రేశ్వరుడి బ్రహ్మోత్సవాలు

9 రోజుల పాటు వేడుకలు

- ముస్తాబైన ఆలయం
- నాలుగు రాష్ట్రాల నుంచి తరలిరానున్న భక్త జనం
- ఏర్పాట్లలో నిమగ్నమైన ఆలయ కమిటీ



తాండూరులోని భావిగి భద్రేశ్వర స్వామి ఆలయం



మూలవిరాట్టు

తాండూరు టౌన్: పట్టణంలో కొలువుదీరిన భావిగి భద్రేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 11న ప్రారంభం కానున్నాయి. బ్రహ్మోత్సవాలకు తెలంగాణ, ఆంధ్ర, కర్ణాటక, మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి భక్తులు తరలిరానున్నారు. ఉత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లను ఆలయ కమిటీ సభ్యులు, దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు ప్రారంభించారు. ఇందులో భాగంగా ఆనవాయితీ ప్రకారం ఉగాది పర్వదినం రోజున రథ చక్రాలను వెలుపలికి తీసి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. వేడుకల్లో భాగంగా ఈ 11, 12వ తేదీల్లో రాత్రి 10 గంటలకు ఆలయం నుంచి రాచన్న దేవాలయం వరకు, తిరిగి రాత్రి 1.30 గంటలకు దేవస్థానం వరకు పల్లకీ సేవ నిర్వహించనున్నారు. 13వ తేదీ రాత్రి 10గంటలకు దేవస్థానం నుంచి రాచన్న దేవాలయం, గంజ్ ఏరియా నుంచి తిరిగి ఉదయం 3 గంటలకు దేవస్థానం వరకు పల్లకీ సేవ ఉంటుంది. 14 తేదీన రాత్రి 2 గంటలకు దేవస్థానం నుంచి హేరూర్‌గల్లి, గాంధీచౌక్, మార్కెట్, రాచన్న దేవాలయం తిరిగి మధ్యాహ్నం 1 గంటకు దేవస్థానం వరకు పల్లకీ సేవ నిర్వహించనున్నారు.

15న రథోత్సవం

బ్రహ్మోత్సవాల్లో ముఖ్య ఘట్టం రథోత్సవం. ఈ వేడుకను ఈ నెల 15న వైభవంగా నిర్వహించనున్నారు. ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు స్వామివారికి ప్రత్యేక పూజలు, నైవేద్యం సమర్పించనున్నారు. సాయంత్రం 4గంటలకు శరణు బసవేశ్వర ఆలయం నుంచి నగరేశ్వరాలయం, గాంధీ చౌక్‌ల మీదుగా దేవస్థానం వరకు కలశం ఊరేగింపు నిర్వహిస్తారు. సాయంత్రం 6గంటలకు రథం పైకి కలశం ఎక్కించే కార్యక్రమం ఉంటుంది. రాత్రి 8గంటలకు రంగవల్లి, కుంభం, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహిస్తారు. రాత్రి 11గంటలకు భద్రేశ్వర్ చౌక్ నుంచి బసవన్న కట్ట వరకు, తిరిగి భద్రేశ్వర చౌక్‌కు రథోత్సవం సాగనుంది. ఈ వేడుకను తిలకించేందుకు వేలాది మంది భక్తులు రానున్నారు.

16న లంకాదహనం

16వ తేదీ ఉదయం 8నుంచి మధ్యాహ్నం 10గంటల వరకు స్థానిక సరస్వతీ శిశు మందిర్ ఆవరణలో పశు ప్రదర్శన ఉంటుంది. ఆరోగ్యంగా ఉన్న పశువుల జతకు బహుమతులు అందజేస్తారు. జాతర జరిగే రోజుల్లో పశు విక్రయాలు జోరుగా సాగుతాయి. అత్యధికంగా జత ఎద్దుల ధర రూ. 2లక్షల వరకు పలికే అవకాశం ఉంటుంది. రాత్రి ఒంటి గంటకు పల్లకీ సేవ, అనంతరం లంకాదహనం ఉంటుంది. 19వ తేదీతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.

ఘనంగా నిర్వహిస్తాం

బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తుల కోసం 11నుంచి 16వ తేదీ వరకు అన్నదాన కార్యక్రమం ఉంటుంది. భక్తులకు అన్ని వసతులు కల్పిస్తాం. ఉత్సవాలకు ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి, ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, ఎంపీ రంజిత్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ సునితారెడ్డి హాజరు కానున్నారు.

– శేఖర్‌గౌడ్, ఆలయ ఈఓ, భద్రేశ్వరాలయం

చెట్టును ఢీకొన్న కారు

బంట్వారం: గుర్తు తెలియని ఓ యువతి కారు డ్రైవింగ్ చేస్తూ చెట్టును ఢీకొట్టింది. ఈ ఘటన గురువారం కోట్‌పల్లి మండలం మోత్కుపల్లి గేటు వద్ద చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. మోమిన్‌పేట వైపు నుంచి తాండూరు మార్గంలో కోట్‌పల్లి వెళ్తున్న కారు రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొంది. దీంతో కారు ముందు భాగం పూర్తిగా ధ్వంసమైంది. యువతి కారు నడుపుతుండగా మరో యువతి పక్క సీటులో ఉన్నట్లు స్థానికులు తెలిపారు. క్షతగాత్రులను 108లో తాండూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రమాద విషయం గురించి కోట్‌పల్లి ఎస్ఐ సత్యనారాయణరాజును అడగ్గా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.



ప్రమాదానికి గురైన కారు

లీకేజీపై అన్ని కోణాల్లో విచారణ

- సంబంధం ఉన్నవారిని వదిలి పెట్టం
- డీఎస్పీ శేఖర్ గౌడ్



తాండూరులోని పరీక్ష కేంద్రం వద్ద బందోబస్తును పర్యవేక్షిస్తున్న డీఎస్పీ శేఖర్‌గౌడ్

తాండూరు టౌన్: పదో తరగతి తెలుగు పరీక్ష ప్రశ్న పత్రం లీకేజీతో సంబంధం ఉన్న వారిని వదిలి పెట్టేది లేదని తాండూరు డీఎస్పీ శేఖర్‌గౌడ్ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. లీకేజీపై విచారణ శరవేగంగా సాగుతోందన్నారు. ప్రశ్న పత్రాన్ని వైరల్ చేసింది ఏ సమయంలో వాట్సాప్ గ్రూపుల్లో చెక్కర్లు కొట్టిందనే విషయంపై లోతుగా విచారణ నిర్వహిస్తున్నామన్నారు. లీకేజీపై అనుమానితులను వదలకుండా విచారిస్తున్నామన్నారు. ఇప్పటికే పలువురిని స్టేషన్‌కు పిలిచి వివరాలు సేకరించామన్నారు. ప్రైవేటు పాఠశాలల హస్తం ఏమైనా ఉందా అనే కోణంలో కూడా దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. విద్య జిరాక్స్ సెంటర్ యజమాని శివను త్వరలోనే అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తామన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు పెంచామని, గురువారం జరిగిన ఆంగ్ల పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు ఆయన తెలిపారు. పట్టణంలోని పలు పరీక్ష కేంద్రాలను డీఎస్పీ శేఖర్‌గౌడ్ తనిఖీ చేశారు.

ఎన్‌సీడీసీ రుణాలు చెల్లించండి

జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి అనిల్‌కుమార్



రైతులతో మాట్లాడుతున్న జిల్లా పశువైద్యాధికారి అనిల్‌కుమార్

దోమ: రైతులు ఎన్‌సీడీసీ (జాతీయ సహకార అభివృద్ధి సంస్థ) ఆధ్వర్యంలో తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి అనిల్‌కుమార్ సూచించారు. గురువారం మండలంలోని గుండాల, కొత్తపల్లి గ్రామాల్లో ఎన్‌సీడీసీ రుణాలు తీసుకున్న రైతులతో మాట్లాడారు. 2016లో తీసుకున్న రుణాలు నేటికీ కట్టకపోడం సరికాదని రైతులకు సూచించారు. తీసుకున్న రుణాలకు వడ్డీ పెరుగుతుందే తప్ప మాఫీ కాదని స్పష్టం చేశారు. రుణాలు చెల్లించని రైతులు ఇబ్బందులు పడాల్సి వస్తుందని పేర్కొన్నారు. త్వరలో రెండో విడత గొర్రెల పంపిణీ పథకం ప్రారంభమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి ఆనంద్, ఆయా గ్రామాల సర్పంచులు కే రాములు, సుజాత తదితరులు పాల్గొన్నారు.

పరిహారం చెల్లించాల్సిందే

- లేకుంటే ఉత్పత్తిని అడ్డుకుంటాం
- స్పాంజ్ ఐరన్ పరిశ్రమ ఎదుట వీర్లపల్లి మహిళల ఆందోళన
- ఐదు పరిశ్రమల్లో నిలిచిన ఉత్పత్తులు



పరిశ్రమ ఎదుట బైఠాయించి ఆందోళన చేస్తున్న వీర్లపల్లి మహిళలు, నాయకులు

నందిగామ: మండల పరిధిలోని స్పాంజ్ ఐరన్ పరిశ్రమల నుంచి వెలువడుతున్న నల్లటి పొగ కాలుష్యం వల్ల గ్రామం మొత్తం మసిబారుతోందని వీర్లపల్లి వాసులు ఆందోళనకు దిగారు. గురువారం ఆ పరిశ్రమ ఎదుట ఎంపీటీసీల సంఘం మండల అధ్యక్షురాలు కే లత ఆధ్వర్యంలో వందలాది మంది మహిళలు ధర్నాకు దిగారు. యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పరిశ్రమలోకి వెళ్లి పనులను నిలిపివేయించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ స్పాంజ్ ఐరన్ పరిశ్రమల నుంచి వెలువడే వాయు కాలుష్యం వల్ల పంటలు, ఆరోగ్యం దెబ్బతింటోందన్నారు. గ్రామంలోని ఇళ్లన్నీ నల్లగా మారుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. సంవత్సరంలో మూడు సార్లు ఇళ్లకు రంగులు వేయించుకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. పరిశ్రమ యాజమాన్యం స్పందించి గ్రామంలోని ప్రతి ఇంటికీ ఆరు నెలలకు ఒక్క సారి రంగులు వేసుకునేందుకు డబ్బు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకుంటే పరిశ్రమను మూసి వేయాలన్నారు. స్పందించిన యాజమాన్యం త్వరలో గ్రామస్థులతో చర్చలు జరిపి సమస్యను పరిష్కరిస్తామని, అప్పటి వరకు ఉత్పత్తులను నిలిపివేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం గ్రామస్థులు మాట్లాడుతూ ఒక వేళ రాత్రి వేళలో గుట్టుచప్పుడు కాకుండా ఉత్పత్తులు ప్రారంభిస్తే పరిశ్రమపై దాడులు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కే శ్రీశైలం, బేగ్, గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.

ధర్నాకు రాని నాయకులపై ఆగ్రహం

మొదటి రోజు పరిశ్రమ ఎదుట నిర్వహించిన ఆందోళనలో పాల్గొన్న కొంతమంది నాయకులు గురువారం నాటి నిరసన కార్యక్రమానికి గైర్హాజరు కావడంతో మహిళలు అనుమానం వ్యక్తం చేశారు. మొదటి రోజు వచ్చిన నేతలు రెండో రోజు ఎందుకు రాలేదని ప్రశ్నించారు. నాయకుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

డబ్బులిస్తేనే మ్యుటేషన్ చేస్తావా?

పంచాయతీ కార్యదర్శిని నిలదీసిన బాధితుడు



పంచాయతీ కార్యదర్శితో మాట్లాడుతున్న అబ్దుల్ సత్తార్

బషీరాబాద్: డబ్బులిస్తేనే మ్యుటేషన్ చేస్తావా? అంటూ ఓ వ్యక్తి పంచాయతీ కార్యదర్శిని నిలదీశాడు. ఈ సంఘటన బషీరాబాద్ పంచాయతీ కార్యాలయంలో గురువారం చోటు చేసుకుంది. బాధితుడి కథనం మేరకు.. బషీరాబాద్‌కు చెందిన అబ్దుల్ సత్తార్ నాలుగు నెలల క్రితం తన సోదరుడి వద్ద 120 గజాల ఇంటి స్థలం కొన్నాడు. ఆ స్థలాన్ని తన భార్య అస్రఫాతిమ పేరిట మ్యుటేషన్ చేయాలని సత్తార్ పంచాయతీ కార్యదర్శి జయకర్‌ను కోరాడు. ఇందుకు రూ. 10వేలు అవుతుందని, అదే రిజిస్ట్రేషన్ చేస్తే రూ.40 వేలు ఖర్చు చేయాల్సి ఉంటుందని కార్యదర్శి వివరించారు. దీంతో ఫిబ్రవరి మొదటి వారంలో అబ్దుల్ సత్తార్ పంచాయతీ కార్యదర్శికి రూ.10 వేలు ఇచ్చాడు. అందులో మ్యుటేషన్ కోసం రూ.4,710 ఆన్‌లైన్‌లో కట్టాడు. మిగిలిన మొత్తానికి రూ.5 వేలు కలిపి ఇస్తే పని పూర్తి చేస్తానని పంచాయతీ కార్యదర్శి చెప్పాడు. దీంతో బాధితుడు గురువారం పంచాయతీ కార్యాలయానికి వెళ్లి డబ్బు తీసుకొని కూడా ఎందుకు పని చేయడం లేదని నిలదీశాడు. నేను డబ్బు ఎప్పుడు అడిగానని పంచాయతీ కార్యదర్శి కూడా ఆగ్రహం వ్యక్తం చేశాడు. దీంతో అక్కడే ఉన్న మాజీ ఎంపీటీసీ నరేష్ చౌహాన్ కల్పించుకుని ఇరువురిని సముదాయించారు. ఇదిలా ఉండగా డబ్బు తీసుకొని కూడా పంచాయతీ కార్యదర్శి ఇంటికి సంబంధించి మ్యుటేషన్ చేయడం లేదని బాధితుడు అబ్దుల్ సత్తార్ ఆవేదన వ్యక్తం చేశాడు. అయితే తాను ఎవరి వద్దా డబ్బు తీసుకోలేదని, కావాలనే ఆరోపణలు చేస్తున్నారని పంచాయతీ కార్యదర్శి జయకర్ పేర్కొన్నారు.

పథకాలతో పేదలకు లబ్ధి

షాబాద్: సంక్షేమ పథకాలతో పేదలకు మేలు చేకూరుతుందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. గురువారం ఆయన మండల పరిషత్ కర్యాలయంలో 105 మంది లబ్ధిదారులకు రూ.1.05కోట్ల విలువైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశబూరు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులందరూ సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పట్నం అవినాశ్‌రెడ్డి, ఎంపీపీ కోట్ల ప్రశాంతిరెడ్డి, వైస్ ఎంపీపీ జడల లక్ష్మి, సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింగ్‌రావు, సహకార సంఘం చైర్మన్ శేఖర్‌రెడ్డి, తహసీల్దార్ సైదులుగౌడ్, డిప్యూటీ తహసీల్దార్ మధు, ఎంపీడీఓ అనురాధ, రైతు సంఘం మండల కన్వీనర్ మధుసూదన్‌రెడ్డి, మండల కోఆప్షన్ సభ్యులు చాంద్‌పాషా, కార్యదర్శి శ్రీరాంరెడ్డి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

చిలుకూరు బాలాజీని దర్శించుకున్న ఎమ్మెల్యే

మొయినాబాద్: చిలుకూరు బాలాజీని బుధవారం మధ్యాహ్నం చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు రంగరాజన్ ఎమ్మెల్యేకు స్వామివారి ఆశీస్సులను అందజేశారు. అంతకుముందు ఎమ్మెల్యే యాదయ్య ఆలయం చుట్టూ 11 ప్రదక్షణలు చేశారు. ఆలయ ప్రాంగణంలోని శివాలయంలో పూజలు చేశారు. ఆయన వెంట ఎంపీటీసీలు శ్రీనివాస్, మల్లేష్, నాయకులు జయవంత్, ఆంద్రూ, విష్ణుగౌడ్, రాంచందర్, నర్సింహ్మాగౌడ్, శ్రీనివాస్, చెన్నయ్య, నవీన్ తదితరులు ఉన్నారు.

బాలిక అపహరణ



నిందితుడు చెన్నయ్య

కుల్కచర్ల: ప్రేమించానని, పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పిన ఓ యువకుడు బాలికను అపహరించిన సంఘటన చౌడాపూర్ మండల పరిధిలో చోటుచేసుకుంది. నవాబుపేట్ ఎస్ఐ పురుషోత్తం వివరాల ప్రకారం.. కొత్తపల్లికి చెందిన మసిగారి చెన్నయ్య ఇదే గ్రామానికి చెందిన ఓ బాలికను ప్రేమ పేరుతో లోబర్చుకున్నాడు. పెళ్లి చేసుకుంటానని చెప్పి కాకినాడకు తీసుకెళ్లాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అభివృద్ధిలో మనమే టాప్

ఇబ్రహీంపట్నం: అభివృద్ధి, సంక్షేమ పథకాల అమల్లో దేశంలోనే తెలంగాణ అగ్రభాగాన నిలిచిందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని శాస్త్రా గార్డెన్‌లో బీఆర్ఎస్ మున్సిపల్ నాయకుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు ఏ వెంకట్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. మిషన్ భగీరథ పథకం కింద రూ. 40 కోట్లు వెచ్చించి ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో ప్రతి ఇంటికీ నల్లా కనెక్షన్ ఇచ్చి తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించినట్లు తెలిపారు. పెద్ద చెరువును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు రూ. 12 కోట్లతో ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు. జాగా ఉంటే ఇంటి నిర్మాణానికి రూ. 3 లక్షలు ఇవ్వనున్నట్లు తెలిపారు. పట్నం ఆస్పత్రిలో డయాలసిస్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తామని చెప్పారు. కొహెడాలో రూ. 450 కోట్లతో పండ్ల మార్కెట్ ఏర్పాటు కానున్నట్లు తెలిపారు. రంగాపూర్ – జాపాల మధ్య 200 ఎకరాల్లో మెడికల్ కళాశాల ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే తనయుడు ప్రశాంత్‌రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ సీ వెంకటరమణారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ ఏ యాదగిరి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఏ చంద్రయ్య నాయకులు ఏ వెంకట్‌రెడ్డి, ఎం వేణుగోపాల్‌రావు, బీ జగదీశ్ యాదవ్, ఎం అంజిరెడ్డి, జే రాజు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో దూడ మృతి



కుక్కల దాడిలో చనిపోయిన దూడ

తలకొండపల్లి: కుక్కల దాడిలో దూడ మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. గ్రామస్థుల కథనం ప్రకారం.. దేవుని పడకల్ గ్రామానికి చెందిన కే సత్యనారాయణ బుధవారం సాయంత్రం తన పొలంలో ఆవు, దూడను కట్టేసి ఇంటికి వెళ్లాడు. గురువారం ఉదయం పొలానికి వెళ్లి చూడగా దూడ మృతదేహం కనిపించింది. బుధవారం అర్ధరాత్రి సమయంలో కుక్కలు దాడి చేయడంతో దూడ చనిపోయిందని తెలిపారు.

ఉరుముల శబ్దానికి ఆగిన ప్రాణం

షాద్‌నగర్ రూరల్: ఉరుములు మెరుపులతో కూడిన శబ్దానికి భయాందోళనకు గురైన ఓ మహిళ ప్రాణాలొదిలింది. ఈ సంఘటన రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ మండల పరిధిలోని గంట్లవెల్లిలో గురువారం చోటు చేసుకుంది. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని గంట్లవెల్లిలో సాయంత్రం వర్షం కురుస్తున్న సమయంలో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ శబ్దం వచ్చింది. అదే సమయంలో వాకిట్లో ఉన్న మంగలి అంజమ్మ భయాందోళనకు గురై హఠాత్తుగా కుప్ప కూలిపోయింది. దీంతో గ్రామస్తులు చికిత్స నిమిత్తం షాద్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. పరీక్షించిన వైద్యులు ఆమె అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత



పోలీసులు స్వాధీనం చేసుకున్న ట్రాక్టర్

బొంరాస్‌పేట: మండల పరిధిలోని మహంతీపూర్‌లో బుధవారం రాత్రి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టరును పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ శంకర్ వివరాల మేరకు.. బుధవారం రాత్రి 9గంటలకు కెతావత్ రాజు మహంతీపూర్ వాగు నుంచి కొత్తూరుకు అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా గస్తీ పోలీసులు పట్టుకున్నారు. వాహనాన్ని స్టేషన్‌కు తరలించారు.

ప్రాణం తీసిన అతివేగం

బీటెక్ విద్యార్థి మృతి, మరొకరికి తీవ్ర గాయాలు

ఇబ్రహీంపట్నం: అతి వేగం ఓ విద్యార్థి ప్రాణం తీసింది. బైక్‌ను వేగంగా నడుపుతున్న క్రమంలో అదుపు తప్పి డివైడర్‌ను ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో ఓ విద్యార్థి అక్కడికక్కడే మృతి చెందగా మరో విద్యార్థి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలోని మంగల్‌పల్లి గేట్ సమీపంలో గురువారం చోటుచేసుకుంది. సీఐ రామకృష్ణ కథనం మేరకు.. వనపర్తి జిల్లా రేవల్లి మండల కేంద్రానికి చెందిన కే శివకుమార్ రెడ్డి(22) బీ జశ్వంత్‌రెడ్డి స్నేహితులు. చింతపల్లిగూడ పరిధిలోని విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ ప్రథమ సంవత్సరం చదువుకుంటూ బీఎన్‌రెడ్డి నగర్‌లో గల హాస్టల్ ఉంటున్నారు. వీరు నగరం నుంచి ఇబ్రహీంపట్నం వైపు బైక్‌పై వస్తుండగా మంగల్‌పల్లి క్రాస్ వద్ద వాహనం అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. బైక్ నడుపుతున్న శివకుమార్‌రెడ్డి అక్కడికక్కడే మృతిచెందాడు. జశ్వంత్‌కు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.